క్లుప్తంగా

బియ్యం, సరుకులు పంపిణీ



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ వృద్ధులు, దివ్యాంగులకు తమ వంతుగా సహాయం అందించాలని శ్రీ హనుమాన్ ఆదర్శ సేవా సమితి అధ్యక్షుడు మామిడి మురళీకృష్ణ కోరారు. నెలా నెలలో భాగంగా ఆదివారం కొత్తపేటలోని సమితి కార్యాలయంలో వంద మంది వయోవృద్ధులు, దివ్యాంగులకు 13 రకాల నిత్యావసర వస్తువులు, బియ్యం కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్యఅతిథి కూర్నాల హరివెంకటసతీష్ మాట్లాడుతూ సమితి తరపున ఎంతో కాలంగా పేదలకు సహాయ సహకారాలు అందించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సభ్యులు పోలేపల్లి వెంకట సుబ్రహ్మణ్యం, కూరపాటి లీలాకర్, పలకలూరి శివరావు, మామిడి వెంకటశ్రావణ్, టి.మురళీ సాయి, పల్లంపాటి రజనీశ్వరరావు, టీజీ సారథి, మాజేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

చేబ్రోలు: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీ కొట్టడంతో వృద్ధుడు మరణించిన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు శివారులో ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వట్టిచెరుకూరు మండలం ముట్లూరు గ్రామానికి చెందిన బెల్లంకొండ తిరుపతయ్య (64) గుంటూరులో నిర్మాణంలో ఉన్న పెట్రోలు బంకుకు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం ముట్లూరు నుంచి తన మోపెడ్‌పై గుంటూరు వస్తుండగా నారాకోడూరు, బుడంపాడు మధ్య ఓ దాబా సెంటర్ ఎదురుగా వెనుక నుంచి వచ్చిన కారు వేగంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తిరుపతయ్య అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కారు ముందుబాగంలో టీవీఎస్ వాహనం ఇరుక్కుపోయింది. ప్రమాద సంఘటనపై చేబ్రోలు ఎస్ఐ పి మహేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఎన్నికలకు పోలీసు శాఖ సంసిద్ధం



తెనాలిరూరల్: ఎన్నికల నిర్వహణలో కీలకమైన భద్రతా, బందోబస్తు చర్యలు చేపట్టేందుకు పోలీసుల శాఖ సంసిద్ధంగా ఉందని డీఎస్పీ ఎం.రమేష్ తెలిపారు. తెనాలి సబ్ డివిజన్‌లో తెనాలి, పొన్నూరు నియోజకవర్గాలు ఉన్న నేపథ్యంలో ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలీసులు సిబ్బందికి ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఏ బృందం ఎక్కడ విధుల్లో ఉండాలి, విధి నిర్వహణలో ఏ విధమైన చర్యలు తీసుకోవాలన్న అంశంపై సివిల్ పోలీసులతో పాటు కేంద్ర బలగాలకూ దిశా నిర్దేశం చేశారు. అనంతరం డీఎస్పీ విలేకర్లతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మొబైల్ పార్టీ, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ సంచరిస్తూ ఉంటాయని, ఎక్కడికక్కడ ట్రాఫిక్ క్రమబద్ధీకణతో పాటు పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని విధాలుగా సిబ్బంది అప్రమత్తంగా ఉంటారని తెలిపారు. తెనాలి, పొన్నూరు నియోజకవర్గాల్లో ఇప్పటికే 284 మంది రౌడీ షీటర్లను బైండోవర్ చేశామని, 2019 ఎన్నికల సందర్భంలో కేసుల్లో ఉన్న వారినీ బైండోవర్ చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల వరకు ఏ వాహనాన్ని అనుమతించేది లేదని స్పష్టం చేశారు. కార్లు 200 మీటర్ల దూరంలోనే ఆపేస్తామని చెప్పారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్‌లను అనుమతించేది లేదని స్పష్టం చేశారు. స్థానికంగా ఓటు హక్కులేని వారిని గుర్తిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నియోజకవర్గంలో 40 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించామని, పోలీసులు వీడియో రికార్డింగ్‌తో విధులు నిర్వహిస్తుంటారని చెప్పారు. ఎక్కడ చిన్న ఘటన జరిగినా వెంటనే సంబంధిత పోలింగ్ కేంద్రానికి చేరుకునేలా స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ కోసం 25 రూట్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించి, ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ కోరారు. ఆయన వెంట సీఐలు, ఎస్ఐలు సిబ్బంది ఉన్నారు.

ట్రాక్టర్ బోల్తా: డ్రైవర్ మృతి

భట్టిప్రోలు: ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడటంతో డ్రైవర్ మృతి చెందిన సంఘటన భట్టిప్రోలు మండలం పెదలంక మధ్యగూడెంలో చోటు చేసుకుంది. మధ్యగూడెంకు చెందిన దున్నా శ్రీధర్(35) ఆదివారం ఉదయం ఇసుక లోడుతో పెదలంక నుంచి వెల్లటూరు వెళుతున్నాడు. చింత మోటు స్మశాన వాటిక దగ్గరకు వచ్చే సరికి ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న శ్రీధర్ ట్రాక్టర్ కింద పడి మృత్యువాతకు గురయ్యాడు. సమాచారం మేరకు ఎస్ఐ కాసుల శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రొక్లయినర్‌తో ట్రాక్టర్‌ను బయటకు తీయించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

నేడు పోలింగ్.. సర్వం సిద్ధం

- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటలకు వరకు ఓటు వేసే అవకాశం
- తూర్పు ఎన్నికల బరిలో 14 మంది అభ్యర్థులు
- గుంటూరు తూర్పులో 255 పోలింగ్ స్టేషన్లు
- తూర్పు నియోజకవర్గ ఎన్నికల విధుల్లో 1,951 మంది సిబ్బంది
- పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని వసతులు
- పోలింగ్ కేంద్రాల్లోకి ఫోన్లకు అనుమతి లేదు
- ఒక్క ప్రిసైడింగ్ ఆఫీసర్ ఫోన్‌కు అనుమతి
- 7 గంటలకు పోలింగ్ ప్రారంభం



పోలింగ్ మెటీరియల్‌ను తీసుకువెళుతున్న సిబ్బంది

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికలకు అధికారులు సర్వంసిద్ధం చేశారు. సోమవారం పోలింగ్ ఉదయం 7 ప్రారంభించనున్నారు. సాయంత్రం 6 గంటల వరకు ఓటు వేసే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించింది. ఎక్కడ కూడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. తూర్పు నియోజకవర్గ నుంచి పోటీలో 14 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. గుంటూరు తూర్పులో మొత్తం 2,50,691 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,21,849 మంది, మహిళలు 1,28,808 మంది, ఇతరులు 34 మంది ఉన్నారు.

ఎన్నికల విధుల్లో 1,951 మంది సిబ్బంది

నియోజకవర్గంలో 255 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు 234 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యాస్టింగ్(డైరెక్ట్ ఎన్నికల కమిషన్‌కు లైవ్)జరుగుతుంది. తూర్పు నియోజకవర్గానికి సంబంధించి మొత్తం 1,951 మంది సిబ్బంది ఎన్నికల విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో 306 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్స్, 306 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్స్, 1,224 మంది ఓపీఓలు, 22 మంది సెక్టార్ అధికారులు, 22 మంది రూట్ ఆఫీసర్లు, 71 మంది మైక్రో అబ్జర్వర్లు విధుల్లో ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద వసతులు

తూర్పు నియోజకవర్గంలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేశారు. దివ్యాంగులకు వెళ్లేందుకు వీలుగా ర్యాంపులు, వీల్ ఛైర్లు, తాగునీరు, బ్యారీకేడింగ్, టెంట్,ఇతర వసతులు కల్పించారు.

11 గుర్తింపు కార్డులో ఏదో ఒకటి చూపించి..

బీఎల్ఓల ద్వారా ఇప్పటికే ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేశారు. పోలింగ్ రోజు ఓటరు గుర్తింపు కార్డు తీసుకురావాలి. ఓటర్ కార్డు లేకపోతే ఎన్నికల కమిషనర్ మార్గదర్శకాల మేరకు పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ గుర్తింపు కార్డు, ఫొటో ఉన్న బ్యాంక్ అకౌంట్ పాస్ట్ బుక్, పాన్‌కార్డ్, నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ పరిధిలోని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా జారీ చేసిన స్మార్ట్ కార్డు, ఉపాధి హామీ గుర్తింపు కార్డు, కార్మిక శాఖ జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు, ఫొటో ఉన్న పెన్షన్ కార్డు, ప్రజా ప్రతినిధులకు జారీ చేసిన అధికార గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు వంటి 11 గుర్తింపు కార్డులో ఏదో ఒకటి పోలింగ్ అధికారులకు చూపించి ఓటు హక్కు వినియోగించుకోవచ్చు.

పోలింగ్ బూతుల్లో ఫోన్లకు అనుమతి లేదు

పోలింగ్ బూతుల్లోకి ఫోన్లకు అనమతికి ఎన్నికల కమిషన్ నిరాకరించింది. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లే ముందు ఫోన్ తీసుకెళ్లకపోవడమే మంచిది. ఒక్క ప్రిసైడింగ్ ఆఫీసర్‌కు తప్ప ఎవరికి కూడా ఫోన్ అనుమతి లేదని కమిషన్ స్పష్టం చేసింది.

6 గంటలకు మాక్ పోలింగ్

నేడు ఉదయం 5.30 గంటలకే పోలింగ్ ఏజెంట్లు, సిబ్బంది పోలింగ్ కేంద్రం వద్దకు రావాల్సి ఉంటుంది. ఉదయం 6 గంటలకు మాక్ పోలింగ్ నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాటు చేశారు. మాక్ పోలింగ్ తరువాత ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభించనున్నారు.

పోలింగ్ మెటీరియల్ తరలింపు

ఆదివారం ఉదయం 7 గంటల నుంచే సిబ్బంది ఎన్నికల విధులకు హాజరై పోలింగ్ మెటీరియల్‌ను సిద్ధం చేసుకున్నారు. మధ్యాహ్నం నుంచి బస్సుల్లో ఆయా పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ మెటీరియల్‌ను సెక్టార్ అధికారుల పర్యవేక్షణలో తరలించారు.

అహల్య హాస్పిటల్‌లో మదర్స్ డే వేడుకలు

గుంటూరు మెడికల్: ఆధునిక జీవనశైలి వలన మహిళలకు వారికి తెలియకుండానే సంతానలేని సమస్యలు వస్తున్నాయని సీనియర్ ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్యులు, అహల్య హాస్పిటల్ నిర్వాహకులు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ అన్నారు. స్థానిక కొత్తపేట శివాలయం సమీపంలోని అహల్య హాస్పిటల్‌లో ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి ఆధ్వర్యంలో మదర్స్ డే, నర్సస్ డే వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమాశంకర్ మాట్లాడుతూ మహిళలు వారికున్న ఆరోగ్య సమస్యల వల్ల లేదా స్ట్రెస్ వల్ల ఇన్ ఫర్టిలిటీ ప్రాబ్లమ్స్ వస్తున్నాయని వివరించారు. తల్లులందరికీ మదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ రాజకుమారి మాట్లాడుతూ సంతానం లేని వారు చింతించకుండా ఆధునికి చికిత్సలు నేడు అందుబాటులో ఉన్నాయని గుర్తించి వాటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ శిరీష ,డాక్టర్ బలరాం అహల్య హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

వెల్లటూరులో శంకరాచార్య జయంతి వేడుకలు



వెల్లటూరులో శంకర జయంతి వేడుకల్లో అర్చకులు



భట్టిప్రోలులో శంకరాచార్యుని జయంతి వేడుకల్లో ఆశ్రమ నిర్వాహకులు

వెల్లటూరు(భట్టిప్రోలు): శ్రీ ఆదిశంకరాచార్యుల వారి జయంతి పురస్కరించుకుని భట్టిప్రోలు మండలం వెల్లటూరులోని శంకర మఠంలో ఆదిశంకరాచార్యుల వారికి ఆదివారం అభిషేకాలు నిర్వహించారు. శారదా అమ్మవారికి విశేష పూజ, కుంకుమార్చన, మల్లెల పూజ శాస్త్రయుక్తంగా జరిపారు. శంకరమఠం ప్రధాన అర్చకులు చందూ మాస్టార్ పూజా కార్యక్రమాలను నిర్వహించారు. 12 ఏళ్ల చిరు ప్రాయంలోనే ఇంటిని విడిచి యావత్ భారత దేశాన్ని కాలి నడకన సంచరించి నలు దిక్కులా పీఠాలను స్థాపించి తన బోధనలతో భరత భూమిని వెలుగులతో నింపిన ఆధ్యాత్మిక తేజోమయ జ్యోతి జగద్గురు శ్రీ ఆది శంకరా చార్యులవారని వక్తలు కొనియాడారు.

భట్టిప్రోలులో..

భట్టిప్రోలు సాధన మండలి బ్రహ్మ విద్యాశ్రమంలో ఆదిశంకరాచార్యులు జయంతి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమ అధ్యక్షురాలు బూర్లె అరుణ కుమారి మాట్లాడుతూ వేదాంత రహస్యాన్ని మానవుడు తరించేందుకు ప్రబోధం చేసిన మహనీయుడు శంకరాచార్యులని పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.యశోద, పి.దేవసేన ఆండాళు, బి. రాజరాజేశ్వరి, ఎం.శశికళ, బి.హేమ పద్మ, డి.శశికళ పాల్గొన్నారు.

జగద్గురువు ఆదిశంకరాచార్యులు

భట్టిప్రోలు: వేదాలు, శాస్త్రాలకు వక్ర భాష్యం చెబుతూ హిందూ ధర్మం శాఖలుగా విడిపోతున్న నేపథ్యంలో హిందూ ధర్మ ఐక్యత కోసం అద్వైతాన్ని ప్రబోధించిన మహానుభావుడు ఆదిశంకరాచార్యులని సమరసత సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు పేర్కొన్నారు. భట్టిప్రోలు మండలం ఐలవరంలోని రామ మందిరంలో జగత్ గురువులు ఆదిశంకరాచార్యులు జయంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హేమ శంకరరావు భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. శంకరాచార్యులు కాలినడకన దేశమంతటా తిరిగి అష్టాదశ పీఠాలను స్థాపించి హిందూ ధర్మ ఐక్యత కోసం కృషి చేసి 32 ఏళ్లకే పరమపదించి మనలో స్ఫూర్తి నింపిన మహానుభావుడని కొనియాడారు.

పోలింగ్ విధుల్లో..



పోలింగ్ సామగ్రి తీసుకెళ్తున్న ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది



సామగ్రి కోసం బారులు తీరిన ఉపాధ్యాయులు



ఈవీఎంల జాబితాలు సరిచూసుకుంటూ..



సామగ్రి అప్పగించే పనిలో ఎన్నికల సిబ్బంది

గుంటూరు పట్టణంలోని ఎల్ఈఎం బీఈడి కళాశాలలో ఎన్నికలకు సామగ్రిని ఎన్నికల విధుల సిబ్బందికి ఆదివారం అప్పగించారు. ఈవీఎంలతో పాటు ఇతర సామగ్రిని తీసుకెళ్లేందుకు సిబ్బంది ఉదయాన్నే చేరుకున్నారు. సిబ్బందికి అవసరమైన భోజన వసతి కల్పించారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. -సాక్షి ఫొటో గ్రాఫర్, గుంటూరు

సీఎం వైఎస్ జగన్ పాలన వైపే ప్రజలు మొగ్గు

తాడికొండ: తాడికొండలో ఎమ్మెల్యే సుచరిత గెలుపు నల్లేరుపై నడకేనని, ఘనమైన మెజారిటీతో నియోజకవర్గంలో విజయం సాధించబోతున్నారని ఏపీ మార్కెటింగ్ కో ఆపరేటివ్ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం తాడికొండలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్ జగన్ ప్రభంజనం వీస్తుందని, దేశంలోనే సర్వజనులకు ప్రభుత్వ ఫలాలను ఇంటికే అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ వాస్తవాన్ని అనుభవదారులైన 88 శాతం ప్రజలు పూర్తి అవగాహన చేసుకొని జగనన్న పాలన పది కాలాలు కావాలని కోరుకుంటున్నారన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా సంక్షేమం, అభివృద్ధిని సమాన స్థాయిలో తీసుకెళ్ళిన నాయకుడు వైఎస్ జగన్ అని, మారుమూల గ్రామాల్లో విద్యాలయాలు, వైద్యాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇంటింటికీ వైద్యం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికి ప్రభుత్వ సేవలు అందిస్తున్నారన్నారు. ఆడపడుచులు, వృద్ధులు, విద్యార్థులు 90 శాతం మా జగనన్న రావాలని ఆరాటపడుతున్నారన్నారు. అనేక పథకాలను ఇంటికి చేర్చే ప్రభుత్వానికి వ్యతిరేఖంగా నిరుపేదల పొట్టగొట్టేందుకు పూనుకున్న కుటిల కూటమి మూడు పార్టీల నాయకులైన చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి ప్రజలను మోసగిస్తున్నారన్నారు. దాదాపు రూ.2.75 లక్షల కోట్లను ప్రజలకు నగదు రూపంలో ఇచ్చిన ఘనత జగనన్నకే సాధ్యమైందన్నారు. అభివృద్ధి లేదని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నారని, గ్రామాల్లో శాశ్వతంగా జరిగినది అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. తీర ప్రాంతంలో 4 పోర్టులు, 10 హార్బర్లతో 50 లక్షల మందికి ఉపాధి కల్పించే నిర్మాణాలు జరుగుతుంటే అది అభివృద్ధి కాదా అని ప్రశ్నించారు. జనాభాలో సగభాగం ఉన్న మహిళలకు 50 శాతానికి పైబడి రాజ్యాధికారం ఇచ్చిన చరిత్ర దేశంలోనే ఏపీకి దక్కుతుందన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోను 99 శాతం అమలు పరచిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని అన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి చిరునామా..

- గాంధీ పార్క్ పునః ప్రారంభం
- బీఆర్ స్టేడియం అభివృద్ధికి చర్యలు
- రూ.2 వేల కోట్లకు పైగా సంక్షేమం..
- రూ.350 కోట్లతో అభివృద్ధి పనులు
- నాడు- నేడుతో స్కూళ్లకు మహర్దశ
- ఇదీ తూర్పు నియోజకవర్గం అభివృద్ధి



గుంటూరు ప్రారంభమైన గాంధీ పార్క్(ఫైల్)

పట్నంబజారు: గుంటూరు తూర్పు నియోజకవర్గం అభివృద్ధికి చిరునామాగా మారింది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో మహర్దశ వచ్చింది. అందుకే ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి.. తిరిగి అదే పాలన కావాలని కోరుకుంటున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలు సోమవారం నిర్వహించనున్నారు. ఐదేళ్ల క్రితం తూర్పు నియోజకవర్గంలో ఓటర్లు పాడుబడిన పాఠశాలలో ఓట్లు వేసిన పరిస్థితులు. ఇప్పుడు అవే పాఠశాలలు అన్ని హంగులతో.. సంపూర్ణమైన వసతులతో ఎన్నికలకు ముస్తాబు అయ్యాయి. గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా 2014, 2109 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014 సమయంలో టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆయనకు ఎటువంటి సహకారం అందించిన పరిస్థితులు లేవు. దీనితో ఎమ్మెల్యే ముస్తఫా కొంత మేరకు ఆయన సొంత నిధులతో పలు కార్యక్రమాలు చేపట్టిన పరిస్థితులు ఉన్నాయి. ప్రజలకు ఎటువంటి మేలు చేయాలన్నా... జన్మభూమి కమిటీలు చెప్పిందే వేదంగా జరిగిన పరిస్థితులు దాపురించాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ ప్రభంజనం'తో సువర్ణ పరిపాలన మొదలైంది.

ఎన్నో అభివృద్ధి పనులు..

రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గుంటూరు తూర్పు నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోయింది. ముఖ్యంగా టీడీపీ హయాంలో తవ్వి వదిలేసిన రోడ్లను పూర్తి స్థాయిలో నిర్మాణం చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతోంది. రోడ్లు డ్రైన్‌లను సుమారు రూ.350 కోట్లతో అభివృద్ధి చేశారు. రూ.50 కోట్లు శాప్ నిధులతో సీమాంధ్రలోనే అత్యంత పెద్దదైన 26 ఎకరాల విస్తీరణలో ఉన్న బీఆర్ స్టేడియం అభివృద్ధి కొనసాగుతోంది. రూ 6.25 కోట్లుతో గాంధీ పార్క్‌ను పునఃనిర్మాణం చేసి నగర ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. శివారు ప్రాంతాల నుంచి ముఖ్య ప్రాంతాల్లో అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మాణం చేపట్టారు. ముఖ్యంగా పొన్నూరు రోడ్డు, కొత్తపేట నుంచి నెహ్రూనగర్ వరకు రోడ్డు, కుగ్లర్ ఆస్పత్రి రోడ్డుతో పాటు అనేక డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టారు.

ప్రతి ఇంటికి సంక్షేమం..

టీడీపీ ప్రభుత్వం హయాంలో జన్మభూమి కమిటీలు చెప్పిందే వేదం. అయితే వైఎస్సార్ సీపీ పాలనలో వలంటీర్ల వ్యవస్థ విప్లవాత్మకమే. ప్రతి ఇంటికి ఎటువంటి స్వలాభాపేక్ష లేకుండా కేవలం అర్హతే ప్రామాణికంగా వలంటీర్ల వ్యవస్థ ద్వారా సీఎం వైఎస్ జగన్ సంక్షేమాన్ని ప్రతి గడప ముంగిటకు చేర్చారు. రూ 2 వేల కోట్లుకు పైగా సంక్షేమాన్ని పేద ప్రజలకు అందజేశారు. ప్రతి ఇంటికి మేలు చేసిన మనసున్న ప్రభుత్వానికి అండగా నిలబడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

తాటికాయలు కోసే విషయంలో వివాదం

నలుగురికి గాయాలు



పెదకాకాని: తాటికాయలు కోసే విషయంలో ఇరుగ్రామాల మధ్య చోటు చేసుకున్న వివాదం ఘర్షణకు దారి తీసింది. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామానికి చెందిన మేకల అశోక్ గత కొంతకాలంగా తాటి ముంజలు విక్రయిస్తున్నాడు. తాటి కాయలు కోసేందుకు ఆదివారం మరో ముగ్గురితో కలసి కొప్పురావూరు గ్రామ శివారు ప్రాంతంలోని కంతేరు వెళ్లగా కొందరు టీడీపీకి చెందిన వారు అక్కడికి చేరుకున్నారు. ఇరువురి మధ్య వివాదం చోటు చేసుకుంది. వెంటనే కంతేరు గ్రామంలోని స్నేహితులను మరికొంత మందిని ఫోన్ చేసి పిలిపించారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య చోటు చేసుకున్న వివాదం ఘర్షణకు దారి తీసింది, కొప్పురావూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ యువకులపై రాళ్ళు, సీసా పెంకులతో దాడి చేశారు. దాడి చేసిన వారిలో కంతేరు గ్రామ టీడీపీ అధ్యక్షుడు, యువత ఉన్నట్లు బాధితులు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. గాయపడిన వారిలో మేకల అశోక్, విజయ్, కొమ్ము రమేష్, బుల్లా దిలీప్, బలిజేపల్లి ప్రశాంత్‌కుమార్ ఉన్నారు. సంఘటనా స్థలానికి తాడికొండ పోలీసులు చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

ఓటేస్తే... వైద్య పరీక్షల్లో 50శాతం రాయితీ

గుంటూరు మెడికల్: సోమవారం ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని నేషనల్ లివర్ - గ్యాస్ట్రో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ వై.షేక్ కోరారు. ఓటు వేసిన గుర్తుని చూపించి ఆస్పత్రిలో వైద్య పరీక్షల్లో 50శాతం రాయితీ పొందవచ్చన్నారు. మంగళవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అవకాశం ఉందని చెప్పారు.